# మానవనైజం

## చింజరపు భాస్కరాచార్యులు





"పంతులు తాతయ్యా ! బంతిపూలు కోసుకో నియ్యవూ ?"

పాపయ్యపంతులు తలెత్తి చూసేడు. ఎదురుగా గుమ్మానికి ఆనుకొని నిల్చున్నది ఒక పదహారేళ్ళ పడుచు. చెంపకు చారెడేసి కళ్ళు, బంగారం లాంటి మేనిఛాయ, మల్లెమొగ్గల్లాంటి పలువరుస, నీలిరంగు జాకెట్టుపై తెల్లని సిల్కు కండువా ఓణీగా వేసుకుని సూర్యోదయ కాంతుల్లో ఆ సుందరి మెరిసిపోతూ ఉంది. జీవితంలో కాయలుకాసిన అతని ముదుసలికళ్ళకు ఆమె తనను మేల్కొలపడానికి విచ్చేసిన ఉషా సుందరియేమోనని కాస్సేపు భ్రమకలిగింది. కాని అంతలోనే మేల్కొన్న అతని అంతరాత్మ "కాదు కాదు, సాక్షాత్తూ ఈ అమ్మాయి డాక్టరు రంగనాథంగారి నోములపంట కమల కదూ !" అని గుర్తించింది. అలా గుర్తించిన అతని అంతరాత్మ అంతలోనే మరొక గాథ సుషుప్తిలో మునిగింది !

"అవును ! .... తన జీవితస్వప్నం, ఆశాసౌధం సూర్యారావుకి కూడా ఈపాటికి యిదే వయసుండేది. తల్లిలేని బిడ్డని తానే పంచ ప్రాణాలుగా పెంచుకొన్నాడు. కాని .... తన జీవితంలో ఎంతో ప్రేమతో పెంచుకొన్న ఆశలకు దారుణమైన ఆఘాతం తగిలింది. ఇందుకు బాధ్యులెవరు ? .... " ఒక్కసారి పంతులు ఉద్రేకంతో కంపించిపోయాడు. కలతచెందిన అతని మనసు కన్నీరు కార్చింది. " .... లోకంలో అందరి తండ్రుల్లాగే తానుకూడా సూర్యారావుపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. నిజానికి కొడుకుపై తన ఆశలు, ఆశయాలు తప్పిస్తే, జీవితంలో తనకి మిగిలేదేం లేదు. కాని .... తన కనీసపు కోర్కెలే తారుమారయ్యాయి .... ముక్కుపచ్చలారని చిన్ని మొగ్గను మొదట్లోనే త్రుంచి, మోడువారిన ముదుసలికి నిండు జీవితం కల్పిస్తాడు భగవంతుడు ! .... ఏ దేమైనా తాను జీవించి తీరాలి .... ఎందుకో ! .... తనకు తెలియదు. బహుశా ఇదే సృష్టివైచిత్ర్యం ! దాన్ని తాను మార్చలేడు!...."

ఏటి కావల ఉండే శూన్యంలోకి ఓసారి నిశ్చలంగా చూశాడు పంతులు. గతరాత్రంతా మాటుమణిగిన జీవరాశులన్నీ అప్పుడే తమ జీవన యాత్రలో అనాటి పాత్ర నిర్వహించడానికి ప్రారంభించేయి. "బహుశా .... ఇదే కాబోలు జీవితం అంటే !" అనుకొన్నాడు పంతులు. అతని స్మృతిపథంలో ఓ పదేళ్ళు వెనక్కి నడిచినాయ్....

* * *

'.... పాలెం' కృష్ణాతీరంలోని ఓ పల్లెటూరు. ఒకవైపున గలగలమంటూ వడిగా పారే కృష్ణాతరంగిణి, మిగతా వైపుల దట్టమైన చిట్టడవి.... ఇంచుమించు పాలెంకు బాహ్య ప్రపంచంతోగల సంబంధం చాలా తక్కువని చెప్పవచ్చు. పాలెం విజయవాడకు నలభైమైళ్లదూరంలో ఉంది. ఇంకా పట్నం వాతావరణం పాలెంలోకి పూర్తిగా చొరబడలేదు. పచ్చని పైరుచేలు, అమాయకపు పల్లెపడుచుల కేళీవినోదాలు, పల్లెబాలుర వినోద క్రీడలు — వీటి సహజసౌందర్యంతో పాలెం ఒక సిసలైన పల్లెటూరుగా రాణిస్తోంది.

పాలెం అంతాకలిసి ఒక వేయిమంది జనాభా ఉండొచ్చు. ఆ ఊరికి ఒక్కటే ప్రైవేటు బడి ఉంది. ఆ బడికి ఒక్కడే పంతులు — పాపయ్య పంతులు. పల్లెజీవితానికి చాలిన పదహారు ఎక్కాలు, కూడిక తీసివేతలు, నాల్గోక్లాసు చదువూ, ఓ పదిమంది పిల్లలకు చెప్పుకొని తద్వారా తన జీవనాన్ని గడించుకొనేవాడు. అతనికి ఒక్కడే కొడుకు—సూర్యారావు. పిల్లవాని పసితనంలోనే తల్లి చనిపోయింది. ఆ దెబ్బకు క్రుంగిన పంతులు తన జీవిత సర్వస్వం తన కొడుకులోనే చూచుకొనేవాడు. పెరిగి పెద్దవాడయాక పట్నానికి పంపించి,పెద్దచదువులు చెప్పించాలనీ, ఊళ్లేలించాలనీ ఆరేళ్ల ఆ పసివానిలో ఎన్నెన్నో కలలు కనేవాడు.

ప్రజారోగ్య శాఖవారి దృష్టిలో పడని పాలెంకు ప్రస్తుతం ఒక్కరే డాక్టరు — రంగనాథంగారు. వైద్యశాస్త్రంలో చాలా అనుభవం గలవారనీ, ఆయన హస్తగుణం చాల గొప్పదనీ పాలెం ప్రజలంతా చెప్పుకొంటారు. కోటయ్యగారి కోడలు మందులిచ్చి కాపాడిన ఆయనకీర్తి పాలెం అంతా పాకిపోయింది. రంగయ్యగారి అబ్బాయి రామం రక్తగ్రహణితో బాధపడూ, రంగనాథంగారి చేతి చలవవల్లే బతగ్గలిగేనని చెప్పుకొనేవాడు. ఇలాగనే చావుబ్రతుకుల్లో సతమతమవుతున్న అనేక ప్రాణుల్ని ఆయన రక్షించేరని పాలెం అంతా ప్రతీతి.

రంగనాథం దంపతులకు ఒక్కగా నొక్క కూతురు కమల. డాక్టరుగారు, భార్య సావిత్రమ్మగారు కూతుర్ని తమకు దేవుడిచ్చిన కానుకగా భావించి, అల్లారుముద్దుగా పెంచుకొనేవారు.

చంద్రుడిలోకూడా ఒక మచ్చ లేకపోలేదు. స్వచ్ఛమైన కోనేటి నీటి అడుగున బురద లేకపోలేదు. ఎలాంటి సుఖమయమైన జీవితంలోనైనా, కొన్ని అగాధాలు ఎదురుకాక మానవు.

ఒక పడవకు, నదిలో పోతుండగా చిల్లి పడింది. అప్పుడేం చేయాలో ఎవరికీ తోచలేదు. నీళ్ళన్నీ లోపలికొస్తున్నాయి. అప్పుడందులోని ఒక బెస్తవాడు సలహా ఇచ్చాడు.

"దీనికంత బాధపడవలసిన పనేముంది. పడవ కింకొక చిల్లిపొడవండి. ఆ నీళ్ళన్నీ ఆ చిల్లిలోగుండా పోతయి."

కర్లపాలెం మధుసూదనరావు
(పేటపాలెం)

బహుశా ఈ పరస్పర వైరుధ్యాల సమ్మేళనంలోనే జీవితం ఇమిడిఉంది.

రంగనాథంగారికికూడా ఒక్కటే లోపం ఉంది. అది ఆయనలో చదరంగం ఆటపై పేరుకొన్న అత్యంతాసక్తి ! బాల్యంనుండీ ఆయనకా ఆటపై మక్కువ ఉన్నా, అది ఒక వ్యసనంగా పరిణమిస్తుందని ఆయన మొదట్లో ఊహించలేదు. క్రమంగా అది ఆయన నిత్యజీవితంలో వృత్తికంటె ప్రాముఖ్యం వహించే పరిస్థితి ఏర్పడింది! చదరంగం ఆడుతున్నప్పుడు ఆయన రోగాన్నిగురించి ఆలోచించరు, మాట్లాడరు — పైగా మర్చిపోతారు కూడా ! అంచేతనే కాబోలు ఆయన ఆటలో నున్నపుడు ఎవరూ ఆయన దరిదాపుల్లోకి వెళ్లరు. ఆ ఆటలో ఆయన అనుభవించే అనిర్వచనీయమైన ఆనందం ఆయన కొక్కరికే ఎరుక. తన జీవితాన్ని పెడదారి పట్టించినా, దాన్ని అంతగా ఆయన పట్టించుకోలేదు.

## 2

ఆటలాడి అలసి ఇంటికి చేరిన పసివాని ఒంటిమీద చేయివేసి చూచాడు పంతులు. ఒళ్ళు వెచ్చగా సలసల మరుగుతున్నట్లుంది. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లాగ ఉన్నాయి. అప్పుడే రంగ మందు తెచ్చివేశాడు పంతులు. ఆరాత్రి పసివాడు నిద్రపోలేదు.

*

పదిహేనురోజులు గడిచాయి. సూర్యారావుకి జ్వరం విపరీతంగా కాస్తోంది. డాక్టరుగారు మందులెన్నివేసినా, జ్వరం నానాటికీ ఎక్కువవుతూనే ఉంది. టైఫాయిడు జ్వరమని పంతులికి అర్థమైంది. రోజులు గడుస్తున్నకొద్దీ, పంతులుకి ఆరాటం ఎక్కువవుతోంది.

ఆరోజు అమావాస్య. ఆకాశం అంతా మబ్బులు దట్టంగా అలుముకొని ఉన్నాయి. కన్ను పొడుచుకొన్నా కనిపించని కటికచీకటి. చెట్లు విరిగేటంతటి వేగంతో ఈదరగాలి రివ్వున వీస్తోంది. పంతులుగారి పూరింటిలో సన్నని దీపపుకాంతి రెపరెపలాడుతోంది. ఆ దీపపుకాంతిలో పంతులు ముఖంలో కమ్ముకొన్న విషాదచ్ఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"అమ్మోయ్!!" అని ఓ పొలికేక వేసి మంచం మీదనుంచి కిందికి దూకేడు పసివాడు. పంతులు అదిమిపట్టి మళ్లీ పడుకోబెట్టేడు. మరికొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచేయి. ఎక్కడో చెట్లచాటున దాక్కొన్న గుడ్లగూబ ఓసారి వికృతంగా అరిచింది. ఉన్నట్లుండి ఓ పెద్ద మెరుపు మెరిసింది.

"అమ్మోయ్ ! నేనూ నీ దగ్గరికి రావొద్దూ !" అంటూ కేకపెట్టి మంచంమీదనుంచి మళ్లీ కిందపడ్డాడు అర్భకుడు. మళ్లీ లేవనెత్తి మంచం మీద పడుకోబెట్టేడు పంతులు. కాస్సేపు నిశ్శబ్దం కాళరాత్రిని తిలకించేడు.

"ప్రకృతికూడా కార్పణ్యం వహిస్తోందన్నమాట !" అనుకొన్నాడు.

పిల్లవాడు అదేపనిగా పిచ్చిగా పలవరిస్తున్నాడు. ఏమయితే అయిందని పిల్లవాణ్ని భుజంమీద వేసుకొని రంగనాథంగారింటికి బయల్దేరేడు పంతులు.

* * *

రాత్రి పది గంటలవేళ. రంగనాథంగారు చదరంగం హుషారుగా ఆడుతున్నారు. ఆయన బావమరిది రామారావుకూడా చదరంగంలో ప్రవీణుడే. ఆనాడే అతను పట్నం నుంచి బావగారింటికి వచ్చేడు. ఆట మహా రక్తికడుతున్నది. ఇద్దరూ సమానంగా పట్టుదలతో ఎత్తులు వేస్తున్నారు. ఫ్రెంచి డిఫెన్సుపద్ధతి అవలంభించేరు రంగనాథంగారు.

ఇంతలో వీధితలుపు తట్టిన చప్పుడు .... పాలేరు వెంకడు వెళ్లి తలుపు తీశాడు. పంతులు పిల్లవానితో సహా ఖంగారుగా లోపలి కొచ్చేడు.

"డాక్టరుగారూ ! .... " ఆవేదనతోకూడిన ఆక్రందన అది. డాక్టరుగారు శకటుతో ఎదుటి ఏనుగును కొట్టి, రాజనిపించేరు. మళ్లీ ఎత్తు ఆలోచిస్తున్నారు.

"డాక్టరుగారూ ! మా పిల్లవాణ్ని ఎలాగైనా మీరే రక్షించాలండి !" ఎదుటి పార్టీ అడ్డువేసిన గుర్రంబారిని తప్పించుకోడం ఎలాగా అని ఆలోచిస్తున్నారు రంగనాథంగారు.

"పిల్లవాడు అదేపనిగా పలవరిస్తున్నాడండి .... కింద పడుతున్నాడండి" పంతులుకంఠం వణుకుతోంది.

# మానవ నైజం

(25-వ పేజీ తరువాయి)

"ఊఁ ! ! ...." నల్లిని చూసినట్లు చూశారు డాక్టరుగారు.

"పిల్లాణ్ణి మీరే రక్షించాలండి ! .... మీ పాదాలు పట్టుకొంటా ! నా జీవనజ్యోతి నెలాగైనా కాపాడండి డాక్టరుగారు ! ...."

"ఇప్పుడు చూడను. రేపు ప్రొద్దుట కనిపించు !" తాపీగా చెప్పి, మళ్లీ ఆటలో నిమగ్నమయ్యారు డాక్టరుగారు.

"అలా అంటే కాదండి ! పిల్లవాడు చావు బ్రతుకుల్లో ఉన్నాడండి. కాపాడి పుణ్యంకట్టుకోండి ! ...." కన్నీరు మున్నీరుగా విలపించేడు పంతులు.

"చెప్పేది వినే ! ఇప్పుడు వీలుకాదు !...." కొంచెం కఠినంగా ఉంది. మంత్రితో మరో ఎత్తు ఆలోచిస్తున్నారు డాక్టరుగారు.

పంతులు కొయ్యబారిపోయాడు. కాస్సేపటిదాకా నోట తడిలేదు. రోమునగరం ఒకపక్క తగలబడిపోతుంటే, వయొలిన్ వాయిస్తూ ఆనందించినవాళ్లున్నారని తానెక్కడో పుస్తకంలో చదివేడు. కాని .... ఇక్కడ ప్రత్యక్షంగా చూడగలిగేడు!

తడబడే అడుగుల్తో, చేసేదిలేక, బయటికి దారితీశాడు పంతులు. బయటికొచ్చి గాఢ నిశీధిలోకి ఓసారి పిచ్చివాడిలా చూశాడు కడుపు రగిలే ఆవేదనతో. ఇంతలో భుజంపైన చల్లని స్పర్శ తగిలింది. ఊపిరి ఉందేమోనని చూశాడు... ఇంకెక్కడి పసివాడు ! వాని ప్రాణవాయువులీఅనంతవిశ్వంలో ఎప్పుడో లీనమైపోయాయి!" తల నేలకేసి బాదుకొన్నాడు పంతులు. బావురుమంటున్న గుడిసెకేసి చూసి గొల్లుమన్నాడు. గుడిసెలో దీపం ఎప్పుడో ఆరిపోయింది. పంతులు ఆశాజ్యోతికూడా ఆరిపోయింది.

*

జీవితంలో వెలుగునీడలు తరుచు ఒకదాని వెనుక మరొకటి వస్తూనే ఉంటాయి. కాని .... కొన్నిజీవితాలలో ఎప్పుడూ నీడలే ఎదురవుతాయి. జీవితంలో తాను ఎవరికీ కల్లోనైనా అపకారం చేయలేదని పంతులుకి బాగా గుర్తున్నది. కాని .... "తనకే ఈ శిక్ష చేశాడు భగవంతుడు ! ఎందుకు ?... ఏమో ! తనకి తెలియదు !....ఈ జీవన్మరణాల అంతర్యం తనకేం అర్థమవుతుంది ?...దీనికి కొంత వరకు బాధ్యుడు డాక్టరు...అయితే నేం ? అతనికేం లోటు ?...తానింకా ఇలాగే జీవించితీరాలి !... చావలేడు కాబట్టి ! .... " నిట్టూర్పు విడిచేడు పంతులు.

పసివాడు చనిపోయిననాటినుంచీ పంతులు పిచ్చివాడిలా తయారయ్యాడు. మాసినజుట్టు, మలినదేహం, ఎప్పుడూ తనలో తానేదో గొణుక్కుంటూండేవాడు. తరుచు ఏటిఒడ్డున తాను ప్రేమతో పెంచిన బంతిమొక్కలమధ్య కూర్చుని, ఏదో ఆలోచిస్తూండేవాడు.

పంతులు లోకాన్ని మరిచిపోయినా, లోకం పంతుల్ని మర్చిపోలేదు. చాలినంత సానుభూతిని మాత్రం అందించింది. అయినా ఆ సానుభూతి పంతుల్ని మార్చలేకపోయింది....వాడి, రాలిపోయిన పూవుని మళ్లీ ఎప్పటిలాగా రంజింపచేయగలవారెవరు ?

ఆరోజు అట్లతదియ. పుచ్చపూవులాంటి వెన్నెల ఏటిలో నీటిమీదపడి తళతళ మెరుస్తోంది. చల్లగా వీస్తున్న పిల్లగాలి ఏటిఒడ్డున ఉన్న చిన్న మొక్కల్ని నెమ్మదిగా అటూ ఇటూ ఊపుతోంది. చిట్టడవిలోని సర్వేచెట్లు గాలికి చక్కని సంగీతం వినిపిస్తున్నాయి.

పల్లెపడుచులంతా అనేకరకాల వినోదాలలో మునిగితేల్తున్నారు. ఏటి ఒడ్డున ఇసుకతిన్నెల్లో చేరారు రెడ్డిగారి రమణ, డాక్టరుగారి కమల, మున్సబుగారి ముద్దులపట్టి మాణిక్యం మొదలైన బాలికలంతా. కేరింతలు కొడుతూ దాగుడుమూత లాడుకొంటున్నారు. పొదలమాటున దాగేవారు, పరుగెత్తేవారు, పొదివి పట్టుకునేవారు — ఇలా పరిపరివిధాలుగా ఆట సాగుతున్నది.

అంతవరకూ ఒక్కసారైనా కమల 'దొంగ' కాలేదు. ప్రస్తుతం రెడ్డిగారి రమణ 'దొంగ.' కన్పించకూడదనే పట్టుదలతో కమల ఒక పొద చాటున నక్కింది. దాక్కొన్న కమలకు .... పాపం.. దరిదాపుల్లోనే ఉన్న పాములపుట్ట కన్పించలేదు. అంతే ! .... కాలు తొక్కుడుపడిన కృష్ణసర్పం



కస్సుమని కాటేసింది! 'కెవ్వు'మని కేకవేసి కమల నేలకూలింది నోట నురగలు కక్కుకొంటూ

రంగనాథంగారింట్లో ఆనాడు శోకదేవత తాండవిస్తోంది. మున్సబుగారు, కరణంగారు మొదలైన పల్లె ప్రముఖులంతా రంగనాథంగార్ని ఊరడిస్తున్నారు. కమల ఇంకా నురగలు కక్కుతూనే పడివుంది. రంగనాథంగారు కలలోనైనా ఊహించని ఈ హఠాత్పరిణామానికి పిచ్చెత్తినవానిలా తల బాదుకొంటున్నారు. సావిత్రమ్మగారు కన్నీరు మున్నీరుగా శోకిస్తున్నారు. పాముల మంత్రగాళ్లెందరో వచ్చి తమ గరిడీలు చేసి చూపించారు. ఫలితం శూన్యం ! కమల ఎప్పటిలాగే కదలకుండా పడివుంది.

మున్సబుగా రాలోచించారు : "ముక్కుపచ్చలారని ఈ పసిబాలను కాపాడే అవకాశం ఏమీ లేదా ? .... ఆ!!! ఉంది ! .... పంతులొక్కడే నల్లతాచు కాటుకి మంత్రం వేసే మొనగాడు..." వెంటనే మనిషిని పంపేరు పంతుల్ని తీసుకు రమ్మని.

* * *

రోజూలాగే ఏటిఒడ్డున బంతిమొక్కలమధ్య కూర్చుని ఏటిలోకి చూస్తున్నాడు పంతులు. అతని కిప్పుడు ఏడవటానికి ఏడుపుకూడా రావటం లేదు. మనస్సు కొంత గట్టిపడింది.

"పంతులుగోరూ ! .... "

ఎదురుగుండా డాక్టరుగారి పాలేరు వెంకడు.

యాంత్రికంగా ఏటిలోకి ఒకసారి, వెంకడి మొహంలోకి ఒకసారీ చూశాడు పంతులు.

"డాక్టరుగోరమ్మాయిగోర్కి పాము కర్చిందండి ! తమర్ని ఉన్నపాళంగా పిల్సుకురమ్మని తోలేరండి మున్సబయ్యగోరు !"

మళ్లీ ఏటిలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు పంతులు తానెందుకు వెళ్లాలీ అని: " నా బతుకే నేలకూలిందిగా ! ఎవళ్లెలా పోతే నాకేం ? .... అందులోనూ హృదయం, అంతఃకరణా లేని ఆ నరపశువుయింటికి నేనా వెళ్లడం !" తల అడ్డంగా తాటించేడు.

"నే రానని చెప్పు!!!" గట్టిగా అరిచేడు పంతులు. అదిరిపడి ఇంటికి దౌడుతీశాడు వెంకడు.

*

అప్పుడే పొద్దు గూకింది. చేలలోంచి లోల్లాయి పాటలు పాడుకొంటూ, పశువుల్ని తోలుకుంటూ ఇంటివైపు మళ్లుతున్నారు రైతులు. పసిరిచేనులో కూచొని, తీతువుపిట్ట ఒకటి అదేపనిగా కూస్తోంది.

ఏటిలోకి చూసి చూసి ఇంటిముఖం పట్టేడు పంతులు.

రంగనాథంగారి ఇంట్లోంచి పెద్దపెట్టున ఏడుపులు వినిపిస్తున్నాయి. అవి కరడుగట్టిన తన గుండెల్నికూడా చీల్చుతున్నవి: "పాపం ! చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న ఓ అమాయకపు ప్రాణికై ఆక్రందన!" అనుకొన్నాడు పంతులు... "ఆ పసిప్రాణి సరిగా తనకొడుకు లాంటిదే! ఆ ప్రాణి తనకేం చేసింది ? .... ఒక ప్రాణికై మరొక ప్రాణి బలి ! ఇదేనా తన జీవిత సగమార్గం ?"

"కానీ ! ..." గట్టిగా అనిపించింది ఈసారి పంతులుకి. అప్రయత్నంగా అతని కాళ్లు రంగనాథంగారింటికి దారితీశాయి.

"పంతులూ ! వచ్చావుటయ్యా ! నిండు ప్రాణాన్ని నిలబెడుదూ ! నీకు పుణ్యం ఉంటుంది" అన్నారు మున్సబుగారు.

మంత్రముగ్ధుడిలా నడుస్తున్న పంతుల్ని నిర్ఘాంతపోయి చూశారు జనం అంతా. పంతులు బాలికను సమీపించేడు. మనస్సులో దేవుణ్ణి ఒకసారి తలుచుకొని, చెవిలో చిటికవేసి ఏదో మంత్రం చదివేడు. .... కాస్సేపటిలో నిద్రనుంచి మేల్కొన్నట్లు కళ్లు తెరిచింది కమల. రంగనాథం దంపతుల ఆశ్చర్యానికీ, ఆనందానికీ అవధుల్లేవు.

ప్రాణదాతకు పదినూర్ల రూపాయలర్పించబోయారు డాక్టరుగారు. డబ్బుకేసీ, డాక్టరుగారికేసీ ఊహాకందని ఓ వింతచూపు చూసి బయటకు నడిచాడు పంతులు వడిగా.

"బంతిపూలు కోసుకోనా అంటే మాట్లాడవేం తాతయ్యా ?"

ఉలిక్కిపడ్డాడు పంతులు. ఎదురుగా నిలబడిన కమలకేసి ఒకసారి చూసేడు.

"రా ! అమ్మా ! నీ క్కావల్సినన్ని కోసుకో !" అప్రయత్నంగానే అనేశాడు.

"తన జీవితంలోని ఆశలు ఓ వ్యక్తి నిర్దాక్షిణ్యంగా కూల్చేశాడు. అదేవ్యక్తి ఆశలు తాను నిలబెట్టేడు .... బహుశా ఇదే కాబోలు మనిషి నైజం ! మానవుడింకా దానవుడు కాలేదు !" తృప్తిగా నవ్వుకొన్నాడు పంతులు. ★

(ఒక ఆంగ్లకథ ఆధారంగా)